# నాకు పరిచయమైన కిడాంబి రఘునాథ్

పెమ్మరాజు వేణుగోపాలరావు
అట్లాంటా, జార్జియా

అది 1989. హ్యూష్టన్‌లో తానా సభలు జరుగుతున్న సమయం. అట్లాంటా నుంచి వచ్చిన మా బృందం గిరిజాకళ్యాణం నృత్యనాటిక ప్రదర్శించిన రోజు. ప్రోగ్రాము బాగా జరిగిందని అందరం సంతోషంతో ఉన్నాం. పాత్రధారులు ఒకరినొకరు అభినందన చేసుకుంటున్నారు స్టేజివెనకాల. ఆడియన్సులోంచి కొందరు హడావిడిగా వస్తూపోతున్నారు యాక్టర్సుని కంగ్రాటులేట్ చెయ్యటానికి. నాటకసామగ్రి – కాష్ట్యూములు, ప్రాప్స్ వగైరా– అన్నీ సర్దుకుంటూ, తర్వాత కార్యక్రమానికి అడ్డు రాకుండా, ఇటూ అటూ తిరుగు తున్నాను స్టేజివెనకాల. స్టేజి ఎంటన్సులో ఒక కుర్చీలో కూర్చుని తమాషా అంతా చూస్తున్నారు ఒకాయన. ఎవరీయన, ఇలా కూర్చున్నారు ఒంటరిగా ఇంత హడావిడిలో అని ఒక క్షణం ఆలోచించి ఆయన్ని సమీపించాను.

ఆయన వెంటనే లేచి ''నమస్కారమండీ. మీతో రెండు నిమిషాలు మాట్లాడాలని వెయిట్ చేస్తున్నాను. మీరు చాలా బిజీగా ఉన్నారు గదా అని ఇక్కడ కూర్చున్నాను మళ్లీ దొరకరేమోనని.''

ఇది వరకు పరిచయంలేని వ్యక్తి, కాని స్నేహపూర్వకంగా మర్యాదగా పలకరిస్తున్నారు, 'ఎవరు మీరు?' అని నోటి దాకా వచ్చిన మాట మానేసి, ''చెప్పండి ఏమిటి విశేషం? అన్నాను. ''నా పేరు కిడాంబి రఘునాథ్, న్యూజెర్సీ తెలుగు కళా సమితి వారి తెలుగు జ్యోతికి ఎడిటరుని'' అని తనని పరిచయం చేసుకున్నారు. కిడాంబి రఘునాథ్ గారి గురించి తెలుసును నాకు. అది వరకు ఫోనులో పరిచయమే కాని ముఖపరిచయం లేదు. ఇదే మొదటిసారి చూడడం. అదే మా ఇద్దరి స్నేహబాంధవ్యానికి పునాది పడిన ప్రథమ ఘట్టం అనుకోవచ్చు.

ఆనాటి స్టేజి వెనకాల సంభాషణ అంతా తెలుగుజ్యోతి గురించే. ప్రతి సంచికలో కాకపోయినా వీలయినంతవరకూ నేను రచనలు తెలుగుజ్యోతికి పంపిస్తానని వాగ్దానం చేశాను.

అంతకుపూర్వం నాలుగునెలల క్రితం నుంచే మాకు తెలుగుజ్యోతి రెగ్యులరుగా వస్తోంది. చాలవరకు చేతితో వ్రాసిన పత్రిక. ఆంధ్రదేశంలో వెలువడుతున్న పత్రికలనుంచి జిరాక్సు చేసిన రచనలు కొన్నికూడా ఉంటున్నాయి. హ్యూష్టనునుంచి తిరిగి అట్లాంటా వచ్చాక ఒక రోజున నేను అది వరకు వ్రాసిన '' శ్రీ వెంకటేశ్వరుని పశ్చిమదేశ యాత్ర'' అనే కవిత ఒకటి ఒక పేజీకి సరిపడ చేత్తో వ్రాసి పోష్టు చేశాను. అది అందిన వెంటనే ఆయన ఫోనులో కేకేసి ''చాలా బాగుంది ఇది వచ్చేసెప్టెంబరు ఇష్యూలో వేస్తాను'' అని , ''మీరు ప్రతినెలా ఒక రచన తప్పకుండా పంపించాలి, ఏమయినా సరే '' అంటూ బలవంతపెడుతూ సంభాషణ సాగించారు. వెంటనే నేను మర్యాదగా చెప్పాను, '' నేను ప్రతి నెలా వ్రాయగలిగేటంత సమయంగాని నమ్మకం గాని నాకు లేదండి. కాని ప్రస్తుతానికి నా 'కాస్మిక్ కవిత' లో వచ్చిన కవితలు మీకు కావలిసినవి ఎన్నుకుని వేసు కోండి'' అన్నాను.

''అహ అల్లాకాదు. మీరు కొత్తవి పూనుకుని వ్రాయాలి తెలుగుజ్యోతి కోసం'' అన్నారు. ఆ సంభాషణలోనే ఆయనకి తను చేస్తున్న పనిలో ఉన్న పట్టుదల, ఉత్సాహాలు నాకు కనిపించాయి. నా అభిప్రాయాలకి, ఆశయాలకి అనుగుణంగా ఈ వ్యక్తి చేస్తున్న కృషికి సాధ్యమయినంతవరకూ అండగా నిలబడి సమర్థతతో సహకరించాలి అని మనస్సులో అనుకున్నాను. అలా అని తొందరపడి ఆయనకి వెంటనే మాట ఇవ్వలేదు. చూస్తానన్నాను.

ప్రతి వ్యక్తి జీవితంలో నిత్యం ఏదోరకము మార్పు కలగటం ప్రకృతి సహజం. ఈ మార్పులు చిన్నవి, పెద్దవి అనేక రకాల తీవ్రతతో వస్తాయి. మనకు వెంటనే తెలియని మార్పులు ఉంటాయి, తెలిసిన మార్పులుంటాయి. కిడాంబి రఘునాథ్, తెలుగు జ్యోతులతో సంబంధం వల్ల జరిగిన నాలోముఖ్యమైన మార్పు ఒకటి నేను చెప్పుకో గలను. తెలుగులో మళ్లీ వ్రాయటం ప్రారంభించాను రెగ్యులరుగా. అంతకుపూర్వం వ్రాయటం మానెయ్యలేదు కాని నాకు తోచినప్పుడు మాత్రమేఅప్పుడప్పుడు కవితలు వ్రాస్తూండేవాణ్ణి. ఈ కనక్షను ఏర్పడ్డాక తెలుగులో వ్రాయటం ఎక్కువయింది అని ఖచ్చితంగా చెప్పగలను. నాటినుంచీ నేటి వరకూ లెక్క పెడితే షుమారు డెభై తెలుగు జ్యోతులలో నా రచనలు పడ్డాయి. ఈయనతో పరిచయం అయ్యాక నేను రాసిన కవితలన్నీ ముందుగా తెలుగుజ్యోతిలోనే ప్రచురింపబడ్డాయి. ఎవరయినా నన్ను పలకరించి ''ఈ మధ్యన ఏమయినా కొత్త కవితలు రాశారా?'' అని అడిగితే, ''మీరు తెలుగు జ్యోతి తెప్పించుకోండి. నేను వ్రాసినవన్నీ ఆ పత్రికలో పడతాయి'' అని సమాధానం ఇవ్వటం నాకలవాటయిపోయింది.

అప్పటినుంచి ఇప్పటి దాకా వచ్చిన తెలుగుజ్యోతుల కాపీలన్నీ మా బేసిమెంటులో లైబ్రరీలో పదిలపర్చి ఉంచాను.

తెలుగు జ్యోతి వచ్చిన వెంటనే మా ఆవిడ లక్ష్మి చేతిలోకి వెళ్లిపోతుంది ముందు. రఘునాథ్ గారి ఎడిటోరియల్ ముందు చదివి తర్వాత మిగతావాటికేసి చూస్తుంది. ఆయన మాటలలో చెప్పాలంటే, ''ఇన్ని సంవత్సరాలుగా అమెరికాలో ఎన్నో ఒడుదుడుకులు తట్టుకుని ప్రతీనెలా క్రమం తప్పకుండా వెలువడుతున్న సంచిక ఇది.''

''తెలుగు జ్యోతి ఇటు అమెరికాకు, అటు తెలుగుసీమకు వారధిగా ఉండాలి'' అని ఆయన కోరిక. అందుకనే శ్రద్ధతీసుకుని ఆంధ్రదేశంలో వెలువడిన రచనలు, ఇక్కడి అమెరికా రచయితల రచనలు కలిపి పంపించడానికి ప్రయత్నించారు.

ఆంధ్రదేశం వెళ్లివచ్చిన ప్రతీసారి అక్కడి పరిస్థితుల్ని సూక్ష్మంగా వర్ణిస్తూ సంపాదకీయం వ్రాసేవారు. అక్కడి మార్పులు, కొత్తధోరణులు చూసి వచ్చి ``మనసంతా గగ్గోలుగా ఉంటుంది'' అని వ్రాశారు ఒకసారి. అయితే మార్పులు రాకూడదని కాదు ఆయన అభిప్రాయం. ``దేశకాల పరిస్థితులు ఎల్లప్పుడు ఒకటిగా ఉండవు. వాటికి తగినట్టు మనంకూడా మారిపోగలగాలి. అంటే క్రొత్తొక వింత, పాతొక రోత అని పాతవాటి నన్నిటిని తగలబెట్టమనికాదు. వాటిలోని మంచివి మన జీవిత విధానాలకు తగిన వాటిని ఉంచుకుని మార్పు తెచ్చుకోవాలి'' అని వ్రాశారు ఒక సంపాదకీయంలో. ``పాతవాసనలను మూతులుకట్టి బిగించి కొత్తసువాసనల జల్లులకు నాందిపలకడం సహజం'' అని అయనే ఒప్పుకున్నారు.

మనపిల్లలగురించి వారి జీవిత సమస్యలగురించి తాపత్రయపడుతూ ఉండేవారు. ``ఈమధ్య కొంతమంది యువతరంవాళ్ల నడవడికలో వారిమాటలలో కొంచం అపశృతి కనబడుతోంది. వినబడుతోంది. మనం మన వ్యాపకాలలో పడిపోయి పిల్లలను ఒక కంట కనిపెట్టక పోవడంలేదోమో! '' అని పెద్దవాళ్లని హెచ్చరించారు 1997లో ఒక సంపాదకీయంలో.

``ప్రజాసామ్యంలో ఏదయినా సాధించాలంటే ప్రతిమనిషి, ప్రతిచేయి ముఖ్యం'' అని ఆయన నమ్మకం. ``ప్రచ్ఛన్నంగా ఉండి తమాషాలు చూడకుండా, ప్రత్యక్షంగా అన్నింటిలోనూ పాల్గొని తగురీతిని సలహాలను ఇచ్చి రాబోయే తరాలకు మార్గదర్శకులు కావాలి'' అన్నారు.

తెలుగుజ్యోతిలో ప్రచురణలన్నీ తెలుగులోనే ఉండనక్కర్లేదు. ఇంగ్లీషులో కూడా ఉండటం అవసరం అని ఆయన ఉద్దేశ్యం. ``పిల్లలకి ముఖ్యంగా అవసరమైన విషయాలగురించి – అంటే మన సంస్కృతి, ఇక్కడి జీవిత సమస్యలూ, భవిష్యత్తుల గరించి – ఆంగ్లభాషలోనే వ్రాయటం మంచిది'' అని నేను ఇంగ్లీషులో వ్రాసి పంపిన వ్యాసాలుకూడా వేసుకున్నారు చాలసార్లు.

తాత్త్విక ధోరణిలో ఒకసారి వ్రాస్తూ ``మన ప్రమేయంలేకుండా మనల్ని నడిపించే అతీత శక్తి మరొకటున్నది. అది మనకు కనపడకుండా మనలను నడిపిస్తుంది. కాబట్టి దాన్ని గుప్పెట్లో పెట్టుకోవడమెలా అనేది ప్రశ్న'' అన్నారు. మనకి సాధ్యం కాని పని తప్పించుకు తిరగకుండా పూనుకుని పని చెయ్యాలి మనం అంతా అని ఆయన నిత్యం పలికే మాటలు. తన అభిప్రాయాలని అనుమానం లేకుండా, సందర్భోచితంగా ధైర్యంగా తెలియ చెయ్యగలిగే అలవాటుకల వ్యక్తి.

``మీ నేస్తం, కి.ర. '' అని సంతకంతో వ్రాసిన వీరి సంపాదకీయాలు కొన్ని మళ్లీ ఒకసారి చదివి నేర్చుకోవలసిన విషయాలు చాలా ఉన్నాయి.